తెలంగాణ శ్రీ చైతన్య విద్యాసంస్థల అవినీతిపై సీబీఐ,ఈడితో విచారణ జరిపించాలి..

2లో

తెలుగు దినపత్రిక

# డైలీ రిపోర్ట్

DAILY REPORT

ఎడిటర్: బక్క రవీందర్

మంగళవారం 27, ఆగస్టు 2024

సమస్య ఏదైనా

దాని వెనుక ఎవరున్నా...
నిజాన్ని నిర్భయంగా చూపిస్తాం
మీకు తెలిసిన ప్రజల సమస్యలు
మాకు తెలియజేయండి.
ఇండిపెండెంట్ జర్నలిజానికి
వేదిక.. మీ డైలీ రిపోర్ట్
ఫోన్ నెంబర్
8501919707



## బలూచిస్థాన్‌లో నరమేధం

- 33 మంది కాల్చివేత
- బస్సులు, ట్రక్కులను అడ్డగించిన సాయుధులు
- ప్రయాణీకులను కిందకి దించి కాల్చివేత
- ఇప్పటికే 33 మంది మృతి
- చావు బతుకులలో మరో 21 మంది
- పాకిస్థాన్‌లోని పంజాబ్ ప్రావిన్స్‌లో ఘటన



పాకిస్థాన్ : పాకిస్థాన్ బెలూచిస్థాన్ ప్రావిన్స్‌లో సాయుధులైన దుండగులు పోలీస్‌స్టేషన్లు, రైల్వేట్రాక్‌లు, వాహనాలపై దాడి చేసి కాల్పులు జరపడంతో 33 మంది ప్రాణాలు కోల్పోయారు. దేశం లోని పెద్దదైన ప్రావిన్సులో భారీ సాయుధ దాడిలో ఇదొకటని అధికారులు చెబుతున్నారు. ఈ 33 మందిలో 23 మంది ఆదివారం రాత్రి హత్యకు గురయ్యారు. ముసాఖెల్ ఏరియాలో బస్సును అడ్డగించి బలవంతంగా అందులోంచి ప్రయాణికులను కిందకు దించివేసిన తరువాత వారిలో కొందరిని గుర్తించి మరీ కాల్పులకు తెగబడ్డారు. " సాయుధులైన దుండగులు ప్రయాణికులనే కాకుండా బొగ్గు లోడుతో వస్తున్న ట్రక్కు డ్రైవర్లను కూడా కాల్చి చంపారు " అని డిప్యూటీ కమిషనర్ హమీద్ జహీర్ చెప్పారు. డ్రైవర్లను మిగతా 2లో

- 2028 ఒలింపిక్స్‌లో తెలంగాణ అథ్లెట్లకు అత్యధికంగా పతకాలు వచ్చేలా కృషి చేస్తాం: రేవంత్ రెడ్డి
- యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడి
- 3 నెలల్లోనే 30 వేల మందికి నియామక పత్రాలు ఇచ్చామన్న ముఖ్యమంత్రి
- త్వరలో మరో 35 వేల పోస్టులు భర్తీ చేస్తామని హామీ

# త్వరలో 35 వేల ఉద్యోగాలు భర్తీ చేస్తాం : రేవంత్ రెడ్డి



**హైదరాబాద్ : నిరుద్యోగ సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ప్రభుత్వం ఏర్పాటైన 90 రోజుల్లోనే 30 వేల మందికి ఉద్యోగ నియామక పత్రాలు అందజేశామన్నారు. మరో 35 వేల ఉద్యోగాలు త్వరలో భర్తీ చేయబోతున్నట్లు చెప్పారు.రాజీవ్ గాంధీ సివిల్స్ అభయ హస్తం చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రభుత్వం ఘనంగా నిర్వహించింది. సచివాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో లబ్ధిదారులకు రేవంత్ చెక్కులు అందజేశారు. ప్రిలిమ్స్ లో ఉత్తీర్ణత సాధించిన 135 మంది అభ్యర్థులకు ఒక్కొక్కరికీ రూ. లక్ష చొప్పున అందజేశారు.**

ఈ సందర్భంగా రేవంత్ మాట్లాడుతూ.. రాష్ట్రం నుంచి అత్యధికంగా సివిల్ సర్వెంట్లు రావాలని ఆశిస్తున్నట్లు చెప్పారు. సివిల్స్ ఉత్తీర్ణులై రాష్ట్ర ప్రతిష్ఠను పెంచాలని ఆకాంక్షించారు. మెయిన్స్లో ఉత్తీర్ణత సాధించి.. ఇంటర్వ్యూకి ఎంపికైన వారికి కూడా రూ.1 లక్ష ఆర్థిక సాయం చేస్తామని ప్రకటించారు. %"చదువుకు తగిన నైపుణ్యాలు లేకపోవడంతో చాలా మంది ఉపాధి అవకాశాలు కోల్పోతున్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో యంగ్ ఇండియా వర్సిటీ ద్వారా 2వేల మందికి శిక్షణ ఇస్తున్నాం. వచ్చే ఏడాది నుంచి 20 వేల మందికి శిక్షణ ఇస్తాం. అంతేకాకుండా యంగ్ ఇండియా స్పోర్ట్స్ వర్సిటీ ఏర్పాటు చేస్తాం. 2028 ఒలింపిక్స్‌లో తెలంగాణ అథ్లెట్లకు అత్యధికంగా పతకాలు వచ్చేలా కృషి చేస్తున్నాం. రాష్ట్ర వ్యాప్తంగా 100 నియోజకవర్గాల్లో 25 నుంచి 30 ఎకరాల్లో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూళ్లు ఏర్పాటు చేస్తాం. గత ప్రభుత్వం వర్సిటీలను నిర్వీర్యం చేసింది. 10, 15 రోజుల్లో అన్ని వర్సిటీలకు నూతన వైస్ ఛాన్సలర్లను నియమిస్తాం. వర్సిటీల్లోని అన్ని ఖాళీ పోస్టులను భర్తీ చేస్తాం. కొందరు ఉద్దేశపూర్వకంగా నిరుద్యోగులను రెచ్చగొడుతున్నారు. తద్వారా రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నారు." అని రేవంత్ అన్నారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. రాష్ట్ర చరిత్రలో అభ్యర్థులకు ఇలా సాయం చేయడం మొదటిసారి మిగతా 2లో

## కెసిఆర్‌ను మించిన పెద్ద తుగ్లక్ కెటిఆర్: ఎంఎల్ఎ వివేక్ వెంకటస్వామి



వారం రోజులుగా బిఆర్ఎస్ నేత కెటిఆర్, అతని మనషులు తనను ఇష్టం వచ్చినట్లు ట్రోల్ చేస్తున్నారని కాంగ్రెస్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి ఆవేదన చెందారు. కెసిఆర్‌ను మించిన పెద్ద తుగ్లక్ కెటిఆర్ అని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. సోమవారం ఆయన సెక్రటేరియట్‌లోని మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతూ తాము కొన్నప్పుడే తన ఫాంహౌస్‌కు కాంపౌండ్ వాల్ ఉందని, ఎఫ్‌టిఎల్, బఫర్ జోన్ నిబంధనల ప్రకారమే తమ ఫాంహౌస్ ఉందని ఆయన పేర్కొన్నారు. సొంత చెల్లెను గెలిపించుకోలేని కెటిఆర్ లీడర్ ఎలా అవుతారని ఆయన విమర్శించారు. సినిమా యాక్టర్లతో కెటిఆర్‌కు ఉన్న సంబంధాలు అందరికీ తెలుసు అని ఆయన వ్యాఖ్యానించారు. కావాలనే తనపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని, దానిని నిరూపించాలని కెటిఆర్‌కు వివేక్ సవాల్ చేశారు. తెలంగాణ ఉద్యమం, ప్రజల సమస్యలు చూపేందుకే తాను టివి ఛానల్‌ను స్థాపించానని మిగతా 2లో

## తెలంగాణ అంతటా హైడ్రా విస్తరణ మంత్రి పొన్నం



- రాష్ట్రంలో పెద్ద ఎత్తున ఆక్రమణలు
- ప్రజల భాగస్వామ్యంతో వివరాల సేకరణ
- హైడ్రా చర్యలకు ప్రజామోదం ఉంది
- మంత్రి పొన్నం ప్రభాకర్

హైడ్రా చర్యలకు ప్రజామోదం ఉందని, ఈ తరహా చర్యలు రాష్ట్రమంతటా విస్తరిస్తామని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. తెలంగాణ అంతటా చెరువులు ఆక్రమణలకు గురయ్యాయని చెప్పారు. సోమవారం ఇక్కడ ఆయన మీడియాతో మాట్లాడారు. వాటి వివరాలు సేకరించే పనిలో ప్రభుత్వం ఉందన్నారు. ఇందుకు ప్రజలు సహకరించాలని కోరారు. ఆక్రమణలకు గురైన చెరువుల వివరాలను తమకు ఇవ్వాలని కోరారు. హైదరాబాద్ పరిధిలో హైడ్రా చేపట్టిన చర్యలను ప్రజలంతా ఆమోదిస్తున్నారన్నారు. తెలంగాణ వ్యాప్తంగా చెరువుల పరిరక్షించుకోవాలని ధ్యేయంతో ప్రభుత్వం ఉందని మంత్రి పొన్నం అన్నారు. గతంలో ఎక్కడ చెరువులు ఉన్నాయో స్వచ్ఛంద సంస్థలకు, స్థానికులకు మిగతా 2లో

## రిటైర్‌మెంట్ ప్రసక్తే లేదు : మాయావతి



క్రియాశీల రాజకీయాల నుంచి తాను తప్పుకోబోవడం లేదని బహుజన్ సమాజ్ పార్టీ (బిఎస్‌పి) అధినేత్రి మాయావతి సోమవారం విస్పష్టంగా ప్రకటించారు. 'అటువంటి నకిలీ వార్తలను కులతత్వ మీడియా ప్రచారం చేస్తున్నది' అని ఆమె ఆరోపించారు. 68 ఏళ్ల మాయావతి ఉత్తర ప్రదేశ్‌కు నాలుగు సార్లు ముఖ్యమంత్రిగా వ్యవహరించారు. 'డాక్టర్ భీమ్‌రావు అంబేద్కర్, కాన్షీరామ్‌జీ వంటి అంబేద్కరైట్ బహుజనుల సమాజాన్ని బలహీనపరిచేందుకు ప్రత్యర్థుల కుట్రలను భగ్నం చేసేందుకు నా చివరి క్షణం వరకు ఆత్మగౌరవానికి, బిఎస్‌పి ప్రతిష్ఠాత్మకు ఉద్యమానికి నిబద్ధమై ఉండాలన్న నా నిర్ణయంలో మార్పు లేదు' అని మాయావతి 'ఎక్స్' పోస్ట్‌లో స్పష్టం చేశారు. 'అంటే క్రియాశీల రాజకీయాల నుంచి నా రిటైర్‌మెంట్ ప్రశ్నే లేదన్న మాట. నా పరోక్షంలో లేదా అనారోగ్య పరిస్థితుల్లో బిఎస్‌పి వారసునిగా ఆకాశ్ ఆనంద్ పేరును పార్టీ ప్రతిపాదించినప్పటి మిగతా 2లో

## ప్రస్తుతం పెళ్లి ప్రణాళికలు లేవు... కానీ: రాహుల్ గాంధీ

- ఇటీవల కశ్మీర్ విద్యార్థినులతో మాట్లాడిన రాహుల్ గాంధీ
- పెళ్లి గురించి కాంగ్రెస్ అగ్రనేతను ప్రశ్నించిన యువతి
- ఇప్పుడు ప్రణాళికలు లేవని... కానీ తోసిపుచ్చలేమని వ్యాఖ్య పెళ్లికి అందర్నీ ఆహ్వానిస్తానని రాహుల్ గాంధీ హామీ




ప్రస్తుతానికి వివాహ ప్రణాళికలు ఏమీలేవని... అలా అని వాటిని తోసిపుచ్చలేమని ఏఐసీసీ అగ్రనాయకుడు, లోక్ సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అన్నారు. ఇటీవల జమ్ము కశ్మీర్‌లో పర్యటించిన ఆయన శ్రీనగర్‌కు చెందిన విద్యార్థినులతో కాసేపు ముచ్చటించారు. ఈ సందర్భంగా ఓ యువతి పెళ్లి గురించి అడిగారు. యువతులతో మాట్లాడుతున్న రాహుల్ గాంధీ... పెళ్లి చేసుకోవాలని మీ పెద్దల నుంచి ఒత్తిడి వస్తుందా? అని అడిగారు. ఈ సమయంలో ఓ యువతి మీరు వివాహం ఎప్పుడు చేసుకుంటారని ఎదురు ప్రశ్నించింది.దానికి రాహుల్ గాంధీ నవ్వుతూ సమాధానం చెప్పారు. ఇరవై ముప్పై ఏళ్ల నుంచి ఈ ఒత్తిడిని అధిగమిస్తూ వస్తున్నానన్నారు. ఇప్పుడు పెళ్లి ప్రణాళికలు లేనప్పటికీ, కొట్టి పారేయలేమన్నారు.

ఈ సమయంలో విద్యార్థులు జోక్యం చేసుకొని, పెళ్లి చేసుకుంటే తమను పిలవాలని కోరారు. తప్పకుండా అందర్నీ ఆహ్వానిస్తానని రాహుల్ గాంధీ హామీ ఇచ్చారు.

ఇందుకు సంబంధించిన వీడియోను కాంగ్రెస్ అగ్రనేత తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేశారు.

## నాడు ఫ్రీ అని నేడు ఫీజులు వసూలు చేయడం దుర్మార్గం:హరీశ్ రావు



ఎల్ఆర్ఎస్ ఉచితంగా అమలు చేస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చి, ఇప్పుడు అధికారులకు టార్గెట్లు పెడుతూ ప్రభుత్వం ప్రజలను వేధింపులకు గురిచేయడం దారుణమని మాజీమంత్రి, బిఆర్ఎస్ ఎంఎల్ఏ టి.హరీశ్‌రావు మండిపడ్డారు. ఎల్ఆర్ఎస్ ఉచితంగా అమలు చేయాలని కోరుతూ సోమవారం హరీశ్‌రావు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బహిరంగలేఖ రాశారు. ప్రజలకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం పూర్తి ఉచితంగా అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఒకవైపు రుణమాఫీ కాక, రైతుబంధు రాక రైతన్నలు ఆవేదన చెందుతున్నారని, మరోవైపు విష జ్వరాలతో సామాన్య ప్రజలు ఆసుపత్రుల పాలై, ఖర్చులు భరించలేక అల్లాడుతున్నారని లేఖలో పేర్కొన్నారు. ఇలాంటి ప్రధాన సమస్యలను పరిష్కరించి ప్రజలకు భరోసా ఇవ్వాల్సిన ప్రభుత్వం, ఎల్ఆర్ఎస్ ఫీజులు వసూలు చేయాలని కలెక్టర్ స్థాయి నుంచి పంచాయతీ కార్యదర్శి వరకు యంత్రాంగంపై తీవ్ర ఒత్తిడి చేస్తోందని మండిపడ్డారు. పంచాయతీ కార్యదర్శులు, బిల్ కలెక్టర్లు నిత్యం ఫోన్లు చేస్తూ ప్రజలను వేధిస్తున్నారని, ఫీజులు చెల్లించకుంటే మిగతా 2లో

## చనిపోతున్నా కంటికి కనిపించడం లేదా : కేటీఆర్

- తెలంగాణలో డెంగ్యూతో మరణాలు
- రోజుకు ఇద్దరి కంటే ఎక్కువగా మృతులు
- అయినా లేవని ప్రకటిస్తారా
- రేవంత్ సర్కార్ పై కేటీఆర్ ఆగ్రహం
- వాస్తవాలు తెలుసుకుని ప్రాణాలు కాపాడండి



హైదరాబాద్: రాష్ట్రంలో అసలు డెంగ్యూ మరణాలే లేవంటూ కాంగ్రెస్ ప్రభుత్వం అబద్ధాలు ఆడుతోందంటూ మండిపడ్డారు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్. డెంగ్యూతో నిన్న(ఆదివారం) ఐదుగురు చనిపోయారని, ఇవాళ మరో ముగ్గురు మృతిచెందారంటూ పత్రికల్లో వార్తలు వచ్చాయని నేడు ఎక్స్ లో ఆయన ట్వీట్ చేశారు. కానీ తెలంగాణ ప్రభుత్వం మాత్రం అసలు డెంగ్యూ మరణాలే లేవంటూ చెబుతోందని మండిపడ్డారు. ఈ మేరకు వార్తా పత్రికలకు సంబంధించిన క్లిప్పింగులను ఆయన తన ట్వీట్‌కు జత చేశారు.

**డేటా ఎవరు దాస్తున్నారు..**

మరణాల డేటాను ఎవరు దాస్తున్నారు, ఎందుకు దాస్తున్నారంటూ కేటీఆర్ మిగతా 2లో

# కొండకల్ గ్రామంలో గణంగ కృష్ణాష్టమి వేడుకలు..





**శంకరపల్లి ఆగస్ట్ 26 (డైలీ రిపోర్ట్)** : శంకరపల్లి మండల పరిధి కొండకల్ గ్రామ హనుమాన్ ఆలయం లో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి . ఈ కార్యక్రమం లో తల్లిదండ్రులు తమ పిల్లలని శ్రీ కృష్ణ ,మరియు రాధా వేషధారణ వేయించి కృష్ణజన్మష్టమి జరుపుకున్నారు . పిల్లలు శ్రీ కృష్ణ వేషధారణలో గ్రామ ప్రజలను అలరించడం చూసి ఆనందం వ్యక్తం చేసారు. హిందూ ఇతిహాసాలలో శ్రీ మహావిష్ణువు ఎనిమిదవ అవతారం శ్రీకృష్ణుడి జన్మదినం.కృష్ణ జన్మాష్టమిని కృష్ణాష్టమి అని లేదా జన్మాష్టమి లేదా గోకులాష్టమి లేదా అష్టమి రోహిణి అని కూడా పిలుస్తారు అని గ్రామ పెద్దలు అన్నారు .ఈ కార్యక్రమం లో గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేసారు.

# నెరవేరిన మారుతి నగర్ కాలనీ వాసుల సిసి రోడ్డు కల

**- 14వ వార్డు కౌన్సిలర్ శ్వేత పాండురంగా రెడ్డికి కృతజ్ఞతలు తెలిపిన కాలనీవాసులు**





**శంకర్ పల్లి ఆగస్టు 26 (డైలీ రిపోర్ట్):** శంకర్ పల్లి మున్సిపల్ పరిధిలోని 14 వార్డులోని మారుతి నగర్ కాలనీవాసులు ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న సిసి రోడ్డు పనులు ముగింపు దశకు చేరుకున్నాయి.మున్సిపల్ చైర్మన్ సాత విజయలక్ష్మి ప్రవీణ్ కుమార్ మరియు 14వ వార్డు కౌన్సిలర్ శ్వేత పాండురంగా రెడ్డికి కాలనీవాసులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు .కాలనీ ఏర్పాటు అయి దాదాపు 15 సంవత్సరాలు కావస్తున్నప్పటికీ,కాలనీ వాసులకు సిసి రోడ్డు కలగానే మిగిలిపోయింది. వార్డు కౌన్సిలర్ అయిన జూలకంటి శ్వేతా పాండురంగా రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకోవడంతో, కాలనీలో సిసి రోడ్డు పనులకు మోక్షం కలిగింది. సిసి రోడ్డు లేక వర్షం పడ్డ ప్రతిసారి బురద మయంగా ఉండడంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు. ఇదే కాలనీలో హనుమాన్ మందిరం మరియు డిగ్రీ కాలేజీ ఉండడంతో ప్రధాన గేటు నుండి ఆలయం వరకు మాజీ వార్డు మెంబర్ సట్టగాళ్ళ శ్రీధర్ గౌడ్ చొరవతో నాలుగు సంవత్సరాల క్రితమే ప్రధాన రోడ్డును సిసి రోడ్డుగా వేయడం జరిగింది. మిగిలిన కాలనీ సబ్ రోడ్లు సిసి రోడ్డు లేక ఇన్నాళ్లు కాలనీవాసులు ఇబ్బంది పడ్డారు. ఇప్పుడు వార్డు కౌన్సిలర్ శ్వేతా పాండురంగా రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని కాలనీలో సీసీ రోడ్లు పనులు చేపట్టడంతో కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అలాగే కాలనీలో మిగిలిన రెండు గల్లీలు కూడా సిసి రోడ్డు వేయాలని మున్సిపల్ చైర్మన్ ను మరియు వార్డు కౌన్సిలర్ ను మారుతి నగర్ కాలనీవాసులు కోరుతున్నారు.

# కన్నుల విందుగా కూచిపూడి నృత్యాలు







**సంగారెడ్డి ఆగస్టు 26 :** 78వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలలో భాగంగా సుమన్ ఆర్ట్ థియేటర్స్ ఈవెంట్స్ ఆర్గనైజేషన్ వారి ఆధ్వర్యంలో నాంపల్లి పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వావిద్యాలయం ఆడిటోరియంలో సాంస్కృతిక కార్యక్ర మాలు నిర్వహించారు.ఈ కార్యక్రమం లో సంగారెడ్డి జిల్లా ఇంద్రకరణ్ గ్రామానికి చెందిన కూచిపూడి నాట్యాచార్యులు అంజయ్య గౌడ్ నిర్వహిస్తున్న శృతిలయ కూచిపూడి ఆర్ట్ అకాడమీకి చెందిన పలువురు విద్యార్థుల కూచిపూడి బృంద నృత్య ప్రదర్శన, కూచిపూడి ఏక నృత్య ప్రదర్శనలు వీక్షకులను ఆకట్టుకున్నాయి.ఆద్యంతం కన్నుల పండుగగా సాగిన నృత్య ప్రదర్శనలు కూచిపూడి అభిమానుల కరతాళ ధ్వనులతో ఆడిటోరియం మారు మ్రోగింది.అనంతరం ఈవెంట్ మేనేజ్‌మెంటు వారు నాట్యాచార్యులు అంజయ్య గౌడును ఘనంగా సత్కరించి శిష్య బృందానికి ప్రశంసాపత్రంతో పాటు జ్ఞాపికలు అందజేశారు.

# త్వరలో 35 వేల ఉద్యోగాలు భర్తీ చేస్తాం - రేవంత్ రెడ్డి

అన్నారు. అభ్యర్థులకు ఎంతోకొంత సాయం చేయాలన్న ఉద్దేశంతో చెక్కుల పంపిణీ చేస్తున్నామంటూ డిప్యూటీ సీఎం చెప్పారు. ఇది రాష్ట్రానికి ఉపయోగపడుతుందని ఆశిస్తున్నామని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, సింగరేణి సీఎండీ బలరాం తదితరులు పాల్గొన్నారు.2028 ఒలింపిక్స్‌లో తెలంగాణ అథ్లెట్లకు అత్యధికంగా పతకాలు వచ్చేలా కృషి చేస్తున్నామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేస్తున్నామని, ఇందులో మంచి క్రీడాకారులను తయారు చేస్తామన్నారు. యూపీఎస్సీ ప్రిలిమినరీ పరీక్షలో ఉత్తీర్ణులై... మెయిన్స్ కోసం సన్నద్ధమవుతున్న తెలంగాణ అభ్యర్థులకు 'రాజీవ్ గాంధీ సివిల్స్ అభయహస్తం' పేరిట రూ.1 లక్ష ఆర్థిక సాయానికి సంబంధించిన చెక్కులను రేవంత్ రెడ్డి నేడు పంపిణీ చేశారు. మెయిన్స్‌లోనూ ఉత్తీర్ణత సాధించి ఇంటర్వ్యూకి ఎంపికైన వారికి కూడా రూ.1 లక్ష ఆర్థిక సాయం అందిస్తామన్నారు. సివిల్స్ ఉత్తీర్ణులై తెలంగాణ ప్రతిష్ఠను పెంచాలన్నారు. తెలంగాణ నుంచి అత్యధికంగా సివిల్ సర్వెంట్లు రావాలని ఆయన ఆకాంక్షించారు. ప్రభుత్వం ఏర్పాటైన మూడు నెలల కాలంలోనే 30 వేల మందికి నియామక పత్రాలు అందించామని, మరో 35 వేల పోస్టులను త్వరలో భర్తీ చేస్తామన్నారు. చదువుకు తగిన నైపుణ్యాలు లేకపోవడంతో చాలామంది ఉపాధి అవకాశాలు కోల్పోతున్నట్లు పేర్కొన్నారు. నిరుద్యోగ సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామన్నారు.ప్రతి విద్యా సంవత్సరంలో యంగ్ ఇండియా వర్సిటీ ద్వారా 2 వేల మందికి శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. వచ్చే ఏడాది నుంచి 20 వేల మందికి శిక్షణ ఇస్తామన్నారు. 100 నియోజకవర్గాల్లో 25 నుంచి 30 ఎకరాల్లో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు చేస్తామన్నారు. వర్సిటీల్లో ఖాళీగా ఉన్న అన్ని పోస్టులనూ భర్తీ చేస్తామన్నారు.

# బలూచిస్థాన్‌లో నరమేధం

చంపిన తరువాత కనీసం పది ట్రక్కులకు నిప్పు పెట్టారని ఆయన తెలిపారు. బాధితులు పంజాబ్ ప్రావిన్సుకు చెందిన వారని అధికారులు తెలిపారు.పాకిస్థాన్‌ఇరాన్ రైల్వేలైన్, బెలూచిస్థాన్ రాజధాని క్వెట్టాకు అనుసంధానంగా ఉండే బ్రిడ్జి కూడా పేలుళ్లకు ధ్వంసం అయ్యాయని రైల్వే అధికారి ముహమ్మద్ ఖషీఫ్ చెప్పారు. ఈలోగా ప్రావిన్స్ లోని పోలీస్, సెక్యూరిటీ స్టేషన్లపై సాయుధులు దాడి చేయగా, కనీసం పదిమంది మృతి చెందారని తెలిపారు. ఈ దాడులన్నిటికీ తామే బాధ్యులమని నిషేధిత బెలూచిస్థాన్ లిబరేషన్ ఆర్మీ (బిఎల్ఎ) ప్రకటించింది. పారామిలిటరీ స్థావరంపై కూడా దాడి చేశామని ఈ మెయిల్ ద్వారా మీడియాకు వెల్లడించింది. అయితే పాకిస్థాన్ అధికారులు ఈ దాడిని ఇంకా ధ్రువీకరించవలసి ఉంది. బెలూచిస్థాన్ ముఖ్యమంత్రి సర్ఫరజ్ బుగ్తి ఈ దాడులను తీవ్రంగా ఖండించారు. మృతుల కుటుంబాలకుతీవ్ర సంతాపం తెలియజేశారు. ముసాఖెల్ సమీపాన అమాయకులైన ప్రయాణికులను లక్ష్యంగా చేసుకుని అత్యంత పాశవికంగా ఉగ్రవాద మూకలు దాడులకు పాల్పడ్డారని, చివరకు వారు తగిన శిక్ష అనుభవించక తప్పదని పాకిస్థాన్ ఫెడరల్ ఇన్‌ఫర్మేషన్ మంత్రి అత్తాయుల్లా తరార్ హెచ్చరించారు. ఈ సంఘటనపై పంజాబ్ ప్రభుత్వ అధికార ప్రతినిధి అజ్మాబుఖారీ తీవ్ర ఆందోళన వెలిబుచ్చారు. గతం లోనూ ఈ తరహా సంఘటనలు చోటు చేసుకున్నాయి. గత ఏప్రిల్‌లో బెలూచిస్థాన్‌లోని నొష్కి సిటీ సమీపాన బస్సులోంచి ప్రయాణికులను దించివేసి వారి గుర్తింపు కార్డులను తనిఖీ చేసి తొమ్మిది మంది ప్రయాణికులను సాయుధులైన దుండగులు కాల్చి చంపారు.
గత ఏడాది అక్టోబర్‌లో పంజాబ్‌కు చెందిన ఆరుగురు కూలీలను గుర్తు తెలియని సాయుధులు కాల్చి చంపారు. బెలూచిస్థాన్ లోని కెచ్ జిల్లాలో ఈ దుర్ఘటన చోటు చేసుకుంది. 2015లో 20 మంది నిర్మాణ రంగ కార్మికులు దాడులకు బలైపోయారు..ఇస్లామాబాద్ %-% పాకిస్థాన్ లో దారుణం చోటుచేసుకుంది. కొందరు సాయుధులు రహదారిని అడ్డగించి, వాహనాల నుంచి ప్రయాణికుల్ని కిందికి దింపేసి కాల్పులు జరిపారు. బలూచిస్థాన్ లోని ముసాఖెల్ జిల్లాలో సోమవారం జరిగిన ఘటనలో 33 మంది ప్రాణాలు కోల్పోయారని డాన్ మీడియా సంస్థ వెల్లడించింది .
మరో 21 మందికి బుల్లెట్ ల గాయాలయ్యాయి.ముసాఖెల్ జిల్లాలోని రరాషమ్‌లోని రహదారిపై ఈ ఘటన చోటుచేసుకుంది. కొందరు సాయుధులు దారిని అడ్డగించి, అటుగా వస్తోన్న బస్సులు, ట్రక్కుల్లో నుంచి ప్రయాణికుల్ని దింపి, వారి గుర్తింపు తనిఖీ చేశారు. తర్వాత వారిపై కాల్పులు జరపడంతో 23 మంది మృతి చెందారు. అంతేగాకుండా వాహనాలకు నిప్పుపెట్టారు. పాక్‌లోని పంజాబ్ ప్రావిన్స్‌కు చెందిన ప్రయాణికులే లక్ష్యంగా ఈ దాడి జరిగినట్లు మీడియా పేర్కొంది. పోలీసు ఉన్నతాధికారులు కూడా ఈ విషయాన్ని ధ్రువీకరించారు.

## తెలంగాణ అంతటా హైడ్రా విస్తరణ మంత్రి పొన్నం

తెలుస్తాయని, ఎవరైనా పోలీసు, రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. చెరువుల పరిరక్షణ స్థానికులదేనని అన్నారు. ప్రభుత్వానికి ఎవరి మీద రాజకీయ కక్ష సాధింపు లేదని తేల్చి చెప్పారు.ఎవరికైనా అన్యాయం జరిగిందంటే కోర్టులు ఉన్నా యని, వాటిని ఆశ్రయించ వచ్చునని మంత్రి పొన్నం అన్నారు. చెరువుల, ఎక్కడికక్కడ అక్రమణకు గురయ్యాయో వాటి ఆధారా లు సంబంధిత అధికారులకు ఇవ్వాలని సూచించారు . ప్రజలం తా ఈ కార్యక్రమం లో భాగస్వామ్యం కావాలని ఆయన కోరారు.

## రిటైర్‌మెంట్ ప్రసక్తే లేదు : మాయావతి

నుంచి కులతత్వ మీడియా అటువంటి బోగస్ వార్తలను ప్రచారం చేస్తున్నది. జనం జాగ్రత్తగా ఉండాలి' అని మాయావతి హిందీ పోస్ట్‌లో పేర్కొన్నారు. 'నన్ను రాష్ట్రపతిని చేయనున్నారంటూ గతంలో కూడా వదంతులు వ్యాప్తి చేశారు. కాన్షీరామ్‌జీ అటువంటి ఆఫర్‌ను తిరస్కరించి, రాష్ట్రపతి కావడం అంటే క్రియాశీల రాజకీయాల నుంచి విరమించుకోవడమే అయినందున పార్టీ ప్రయోజనాల రీత్యా అది తనకు అంగీకారయోగ్యం కాదన్నారు. అటువంటి పరిస్థితుల్లో ఆయన శిష్యురాలినైన తాను దానిని ఎలా అంగీకరించగలను?' అని మాయావతి అన్నారు.

## నెలాఖరు వరకూ వర్షాలే.. 8 జిల్లాలకు ఎల్లో అలర్ట్

తెలంగాణలో ఈ నెలాఖరు వరకూ ఒక మోస్తరు నుంచి అక్కడక్కడా భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నట్టు వాతావరణ కేంద్రం వెల్లడించింది.ఈ నెల 29 నాటికి తూర్పు మధ్య, పరిసర ఉత్తర బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పాడే అవకాశం ఉందని, ఏపీ, యానాంలో దిగువ ట్రోపో ఆవరణంలో నైరుతి దిశగా గాలులు వీస్తున్నాయని వాతావరణ కేంద్రం తెలిపింది. ఈ క్రమంలో తెలంగాణలో రాగల ఐదురోజుల పాటు వర్షాలు కొనసాగే అవకాశాలున్నాయని పేర్కొంది. రాష్ట్రంలో మంగళవారం నాడు ఎనిమిది జిల్లాలకు ఎల్లో అలర్ట్ ప్రకటించింది. 27న భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే ఛాన్స్ ఉందని తెలిపింది. 28న ఉమ్మడి ఆదిలాబాద్‌తో పాటు కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం జిల్లాల్లో వానలు కురుస్తాయని పేర్కొంది.

## కెసిఆర్‌ను మించిన పెద్ద తుగ్లక్ కెటిఆర్: ఎంఎల్ఎ వివేక్ వెంకటస్వామి

ఆయన అన్నారు. అప్పటి సిఎం కిరణ్ కుమార్ రెడ్డి ఎంత ఇబ్బంది పెట్టినా ఆగకుండా తెలంగాణ కల్చర్‌ను కేవలం తన ఛానల్‌లోనే చూపించామని ఆయన గుర్తుచేశారు. కాళేశ్వరం, మిషన్ భగీరథలో జరిగిన అక్రమాలు, లోపాలను తమ పేపర్లు, ఛానల్లో చూపించామన్నారు. కెసిఆర్, కెటిఆర్ ఈ రెండు సంస్థలను బ్యాన్ చేయాలని చూసినా ప్రజల నుంచి వచ్చిన ఆదరణతో ఏమి చేయలేకపోయారన్నారు. బిఆర్ఎస్ అధికారంలో ఉన్న పదేళ్ల పాటు తమ పేపర్‌కు ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రకటనలు రాకుండా వివక్ష చూపించారని ఆయన అన్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో తనపై ఈడీ దాడులు చేయించారన్నారు. తాము ఎలాంటి తప్పు చేయలేదని చివరకు తమ డబ్బులు తమకు ఇచ్చారని వివేక్ వెంకటసాస్వామి గుర్తుచేశారు.

## నాడు ఫ్రీ అని నేడు ఫీజులు వసూలు చేయడం దుర్మార్గం : హరీశ్ రావు

లే అవుట్లు రద్దు చేస్తామంటూ ప్రజలను భయాందోళనలకు గురి చేస్తున్నారని పేర్కొన్నారు. డిమాండ్ నోటీసులు ఇస్తూ టార్గెట్లు పెట్టి మరీ మొత్తం రూ.15 వేల కోట్లు వసూళ్లు చేయాలని ఆదేశాలివ్వడం ప్రజల రక్త మాంసాలను పీల్చడమేనని ఘాటుగా వ్యాఖ్యానించారు. ప్రభుత్వ దుర్మార్గ వైఖరిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. నాడు ఫ్రీ అని, నేడు ఫీజు అంటున్నారు : ఎల్ఆర్ఎస్ అంటే దోపిడీ అని నాడు చెప్పి, ఇవాళ ప్రజలను ఎందుకు దోపిడీ చేస్తున్నారో సమాధానం చెప్పాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. నాడు ఫ్రీ అని, నేడు ఫీజు అంటున్నారని ఎద్దేవా చేశారు. ప్రజలు దాచుకున్న సొమ్మును నిలువునా దోచుకునే కుట్ర చేస్తున్నారని ఆక్షేపించారు. అప్పుడు ఎల్ఆర్ఎస్‌కు ఫీజు వద్దని, ఇప్పుడు అధికారంలోకి రాగానే అదే ఎల్ఆర్ఎస్‌తో దందా చేస్తున్నారా..? అని ప్రశ్నించారు. అప్పుడు కట్టొద్దని, ఇప్పుడు కాటు వేస్తారా అని నిలదీశారు. ఎల్ఆర్ఎస్‌పై గతంలో రేవంత్ రెడ్డితో పాటు భట్టి విక్రమార్క, ఉత్తమ్ కుమార్ రెడ్డి, సీతక్క, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఆయన లేఖలో పొందుపరిచారు.ఎల్ఆర్ఎస్ రద్దు చేయాలంటూ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఏకంగా హైకోర్టుకు వెళ్లారని, ఎన్నికల్లో గెలిచేందుకు ప్రజలను మభ్యపెట్టి రెచ్చగొట్టేలా బహిరంగ సభల్లో ఊదరగొట్టారని గుర్తు చేశారు. ఎన్నికలు పూర్తి కాగానే మాట మార్చి ఎల్ఆర్ఎస్‌పై ఫీజులు వసూలు చేయాలని నిర్ణయం తీసుకోవడం రెండు నాలుకల ధోరణికి అద్దం పడుతోందని మండిపడ్డారు.రాష్ట్రంలో ఉన్న పేద, మధ్య తరగతి ప్రజలపైన రూ.15 వేల కోట్ల మేర ఎల్ఆర్ఎస్ ఛార్జీల భారం వేయడం పాలనలో, హామీల అమలులో డొల్లతనానికి నిదర్శనంగా నిలుస్తోందని ఘాటుగా వ్యాఖ్యానించారు.
ఎల్ఆర్ఎస్‌కు ఒక్క రూపాయి కూడా కట్టొద్దు : ప్రజా పాలన అని డబ్బా కొట్టుకుంటున్న వారికి పాతిక లక్షల దరఖాస్తుదారుల కుటుంబాల ఆవేదన కనిపించడం లేదా..? అని హరీశ్‌రావు ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరిచి ఇచ్చిన హామీ ప్రకారం, పూర్తి ఉచితంగా ఎల్ఆర్ఎస్ అమలు చేయాలని బిఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేశారు. మాట తప్పిన ప్రభుత్వానికి చెంపపెట్టుగా ఏ ఒక్కరూ ఒక్క రూపాయి ఎల్ఆర్ఎస్ ఫీజు చెల్లించవద్దని ప్రజలకు పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వ మెడలు వంచి ఎల్ఆర్ఎస్‌ను ఉచితంగా అమలు చేయించే బాధ్యతను బిఆర్ఎస్ తీసుకుంటుందని హరీశ్‌రావు స్పష్టం చేశారు.

## చనిపోతున్నా కంటికి కనిపించడం లేదా : కేటీఆర్

ప్రశ్నించారు. మరోవైపు ఆస్పత్రుల్లో సరిపడా మందులు లేక రోగులు అవస్థలు పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చాలా ఆస్పత్రుల్లో ఒకే బెడ్‌పై ముగ్గురు, నలుగురు పేషంట్లు పడుకుంటున్నారని ఆగ్రహించారు. దీని ద్వారా డెంగ్యూ సమస్య తీవ్రత ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చని చెప్పారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాలని ఎక్స్ వేదికగా కేటీఆర్ డిమాండ్ చేశారు.
కాగా అంగన్వాడీ కేంద్రాల్లో కుళ్లిన కోడిగుడ్లు పెడుతూ పిల్లల ప్రాణాలతో చెలగాటం ఆడుతోంది కాంగ్రెస్ ప్రభుత్వం అంటూ ధ్వజమెత్తారు. దీనిపై కూడా సమగ్ర విచారణ జరపాలని కోరారు.

# శంకర్‌పల్లి పట్టణంలోని వీధి కుక్కలను ఎనిమల్ బర్త్ సెంటర్‌కు తరలింపు

**- శునకాల బెడదను నివారిస్తున్నాం**

**- ఫిర్యాదు ఇచ్చిన వెంటనే స్పందిస్తున్న కమిషనర్ శ్రీనివాస్**

**- అభినందిస్తున్న పట్టణ ప్రజలు**






**శంకర్‌పల్లి: ఆగస్టు 26: (డైలీ రిపోర్ట్):** శంకర్‌పల్లి పట్టణంలోని 11, 14, 15 వార్డులలో, ఎమ్మార్వో ఆఫీస్ వెనకాల విచ్చలవిడిగా సంచరిస్తున్న వీధి కుక్కలను మున్సిపల్ సిబ్బంది సోమవారం ఎనిమల్ బర్త్ సెంటర్ కు తరలించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ మాట్లాడుతూ శంకర్‌పల్లి మున్సిపల్ కు, బ్లూ క్రాస్ సొసైటీ హైదరాబాద్ వారికి మధ్య ఎంఓయూ కుదుర్చుకున్నారని తెలిపారు. వీధి శునకాలపై ఇప్పటికే కౌన్సిల్ లో చర్చించామన్నారు. రూ.8.75 లక్షలతో బ్లూక్రాస్ సొసైటీ తో ఒప్పందం చేసుకున్నాం అని, కుక్కల తరలింపు కార్యక్రమాలు నిరంతరంగా సాగుతున్నాయి అని తెలిపారు. ఒక్కో కుక్క తరలింపు కోసం రూ.1,650 వెచ్చిస్తున్నాం అని పేర్కొన్నారు. గత నెల రోజుల నుండి పట్టణ పరిధిలో గల వీధి కుక్కలను స్టెరిలైజేషన్ ఏ ఆర్ వి ఇంజక్షన్స్ (యాంటీ రేబిస్ వ్యాక్సిన్) కొరకు అనిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్లకు తరలిస్తున్నామని తెలిపారు. కుక్కలకు ఇంజక్షన్ చేసి తిరిగి పట్టణంలోనే వదిలివేయడం జరుగుతుందన్నారు. ఈ ఇంజక్షన్ చేసిన కుక్కలు విపరీతంగా ప్రవర్తించే లక్షణాలు తగ్గుతాయని, కుక్కలు కరవడం వల్ల ఎలాంటి ప్రమాదం ఉండదన్నారు. వాక్సినేషన్ చేసిన కుక్కలకు గుర్తుగా చెవి వద్ద వి షేప్ కటింగ్ చేసి ఉంటుందన్నారు.కుక్కలు స్వైర విహారం చేస్తూ ప్రజలకు ఇబ్బందులు సృష్టించకుండా ఉండాలని కుక్కలను తరలించడం జరిగిందన్నారు. పట్టణ ప్రజలు వారి వారి కాలనీలలో కుక్కల బెడద ఉన్నట్లయితే మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేయాలని కోరారు. మున్సిపల్ కార్యాలయానికి సెలవు ఉన్న రోజులలో కూడా ప్రజల కొరకు మున్సిపల్ సిబ్బంది కష్టపడుతున్నారని తెలిపారు. ఫిర్యాదు ఇచ్చిన వెంటనే స్పందిస్తున్న కమిషనర్ శ్రీనివాస్ ను, సిబ్బందిని పట్టణ ప్రజలు అభినందిస్తున్నారు.

# ఘనంగా లక్ష బిల్వార్చన పూజ కార్యక్రమం..






**శంకర్పల్లి ఆగస్టు 26: (డైలీ రిపోర్ట్):** శ్రావణమాసం శ్రావణ సోమవారం సందర్భంగా శివునికి లక్ష బిల్వార్చన నిర్వహించడం ఎంతో అభినందనీయమని శంకర్పల్లి మున్సిపాలిటీ 14 అవార్డు కౌన్సిలర్ శ్వేతా పాండు రంగారెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఉదయం శ్రీ వీర హనుమాన్ ఆలయంలో గల శివునికి ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంతో పవిత్రమైన శ్రావణమాసంలో దైవ కార్యక్రమాలు నిర్వహించడం ఎంతో శుభసూచకమని ప్రతి ఒక్కరూ భక్తిశ్రద్ధలతో పూజలో పాల్గొన్నారు. వచ్చిన భక్తులకు జూలకంటి పాండురంగారెడ్డి అన్నదాన కార్యక్రమం. అలాగే ప్రతి శనివారం సంవత్సరం పాటు వారి కుటుంబం అన్నదానం నిర్వహిస్తున్నట్లు పాండురంగా రెడ్డి పేర్కొన్నారు. అన్నదానం నిర్వహిస్తున్న వారి కుటుంబాన్ని దేవుడు చల్లగా చూడాలని వచ్చిన భక్తులు వారిని ఆశీర్వదించారు.

# ఘనంగా శ్రీ కృష్ణాష్టమి వేడుకలు




**పుల్కల్ ఆగస్టు 26 :** పుల్కల్ ఉమ్మడి మండలంలో సోమవారం నాడు శ్రీ కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు చిన్నారులు పలు రకాల వేషాధారణలతో ముస్తాబై పలు రకాల ఆట పాటలతో కోలాటాలు వేస్తూ చిందులు వేశారు అంతేకాకుండా కుల మతాలకతీతంగా తారతమ్యం లేకుండా చిన్నారులు నుత్యం చేస్తూ గ్రామస్తులను ఆకట్టుకున్నారు వీరి నృత్యాలు చూసేందుకు ఆయా గ్రామాల ప్రజలు తమ తమ గ్రామాలలో భారీగా తరలివచ్చా రూ అంతేకాకుండా పలు గ్రామాలలో డప్పు వాయిద్యాలతో పెద్ద ఎత్తున బాణాసంచాలు కాలుస్తూ గ్రామాలలోని పలు వీధులలో తిరుగుతూ పెరుగు భూ డ్లను పగలగొట్టేందుకు పోటాపోటీగా ఎంతో ఉత్సాహంగా చిన్నారులు తమ తమ గ్రామ ప్రజలను ఉత్తేజ వరిచే విధంగా సందడి చేశారు దీంతో గ్రామాలలో పండుగ వాతావరణం నెలకొంది దీంతో శ్రీ కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పుల్కల్ పోలీసులు గట్టి భద్రత ఏర్పాట్లు చేశారు దీంతో ప్రశాంతంగా శ్రీ కృష్ణాష్టమి వేడుకలు జరిగాయి.

## ఐఐటీ విద్యార్థులు రూపొందించిన డ్రైవర్ లెస్ కారు అద్భుతంగా ఉంది:మంత్రి శ్రీధర్ బాబు






**సంగారెడ్డి ఆగస్టు 26( డైలీ రిపోర్ట్ ):** హైదరాబాద్ ఐఐటీ క్యాంపస్ లో విద్యార్థులు తాయారు చేసిన డ్రైవర్ లెస్ వెహికిల్ లో ప్రయాణించారు మంత్రి శ్రీధర్ బాబు, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి, ఐఐటీ డైరెక్టర్ మూర్తి. అనంతరం మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. ఐఐటీ విద్యార్థులు రూపొందించిన డ్రైవర్ లెస్ కారు అద్భుతంగా ఉంది. సిలికాన్ వ్యాలీలో నేను, సీఎం రేవంత్ రెడ్డి డ్రైవర్ లెస్ వెహికిల్ లో ప్రయాణం చేశాము. అక్కడికంటే అద్భుతమైన అనుభూతి ఇప్పుడు ఇక్కడ ప్రయాణం చేస్తుంటే కలిగింది అని మంత్రి అన్నారు.మన తెలంగాణలో ఉన్న ఐఐటీ హైదరాబాద్ రూపొందించిన ఈ టెక్నాలజీ మొత్తం మన దేశానికే గర్వ కారణం అవుతుంది. అయితే ప్రస్తుతానికి ప్రయోగ దశలో ఉన్న ఈ టెక్నాలజీ త్వరలోనే ఆచరణలోకి రావాలని నేను మస్ఫూర్తిగా కోరుకుంటున్న. అలాగే ప్రస్తుతం ప్రపంచంలో ఊపు మీద ఉన్న ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ సేవలను కూడా త్వరలోనే అన్ని రంగాల్లో ఉపయోగించుకుంటాం అని మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు.

## కెజిబివి హాస్టల్లో మెస్ బిల్లులు పెంచాలి ...!

- ఎస్ఎఫ్ఐ జిల్లా కో- కన్వీనర్ గంధసిరి జ్యోతిబసు

- చాలీచాలని మెతుకులతో విద్యార్థినిల బతుకులు



**మరిపెడ ఆగస్టు 26 :** తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం నిధులు పెంచాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కో -కన్వీనర్ గంధసిరి జ్యోతిబసు డిమాండ్ చేశారుసోమవారం నర్సింహుల పేట మండల కేంద్రంలో వివిధ హాస్టల్ లో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సర్వేలు నిర్వహించడం జరిగింది. అనంతరం ఎస్ ఎఫ్ ఐ జిల్లా కో-కన్వీనర్ గంధసిరి జ్యోతి బసు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మధ్యాహ్న భోజన పథకానికి నిధులు పెంచాలని, హాస్టల్,పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం పిల్లలకు ఓ పూట భోజనం అందుతూన్నదనీ, వారికి కొంతమేర పౌష్టికాహారం అందుతున్నదన్నారు.కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఆ పథకానికి ఇచ్చే నిధులను ఏటా తగ్గిస్తున్నాయని విమర్శించారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులు, విద్యార్థులు జీవించే హక్కును హరిస్తున్నదని విమర్శంచారు. ఔట్సోర్సింగ్ లో కొనసాగుతున్న టీచర్లను రెగ్యులర్ చేయాలని, పిల్లలకి షో బిల్లులు బిడ్డలని ప్రభుత్వం సకాలంలో అందియాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మానస, ప్రవళిక, సుష్మ, రవళి తదితరులు పాల్గొన్నారు.

## శిల్పారామంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు....



**మాదాపూర్ ఆగస్టు 26:** మాదాపూర్ లో ని శిల్పారామం లో శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా శ్రీమతి సంధ్య కార్తీక్ శిష్య బృందం కూచిపూడి నృత్య ప్రదర్శన ఆధ్యాంతము అలరించింది. ఈజిప్ట్ నుండి పద్నాలుగు మంది విదేశీ అతిధులను ఎంసిఎచ్ఆర్డీ డిపార్ట్ వారు శిల్పారామం లో నిర్వహిస్తున్న సంస్కృతిక కార్యక్రమాలను తిలకింకాహ్దనికి విచ్చేసారు. డైరెక్టర్ జనరల్ ఎంసిఎచ్ఆర్డీ మరియు ఈ.ఓ స్పెషల్ చీఫ్ సెక్రటరీ గవర్నమెంట్ అఫ్ తెలంగాణ డాక్టర్ శశాంక్ గోయల్ ఐఏఎస్ విచ్చేసి కళాకారులను అభినందించారు. ఇట్టి ముద్దు లాడేయ్ , ముద్దుగారేయ్ యశోద, కృష్ణం కలయసఖి, దశావతర శబ్దం, మరకత మణిమయ, బృందావన నిలయేహ్, సంచార ధర ధర, కొలువైతివారంగా సాయి, భామాకలాపం,మొదలైన అంశాలను కళాకారులూ స్ఫూర్తి, శాంకరి, ఉదయ్ కుమార్, మానస స్నిగ్ధ, రుషికశ్రీ, అక్షర, బిందు, సాత్విక, లాస్య, అస్మిత మొదలైన వారు ప్రదర్శించి మెప్పించారు.

## శంకర్‌పల్లిలో కృష్ణాష్టమి వేడుకలు కనులవిందుగా చిన్నారులు



**శంకర్‌పల్లి ఆగస్టు 26: (డైలీ రిపోర్ట్):** శంకర్‌పల్లి మున్సిపల్ మరియు మండల పరిధిలో కృష్ణాష్టమి వేడుకలను సోమవారం నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా చిన్నారులు కృష్ణుడు, గోపికల వేషధారణలు చూపరులను అలరించాయి. పట్టణ కేంద్రంలో గల గీత మందిరం ఆలయం వద్ద శ్రీకృష్ణుడిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. మండలంలో చిన్నారులు శ్రీకృష్ణుడు, సత్యభామ వేషధారణలు వేసి అందరినీ ఆకట్టుకున్నాయి. తమ పిల్లల వేషధారణలను చూసి తల్లిదండ్రులు మురిసిపోయారు.

# సీఎం రిలీఫ్ ఫండ్ నిరుపేదలకు వరం లాంటిది

- కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు దుర్గారెడ్డి



**పుల్కల్ ఆగస్టు 26 :** మండల పరిధిలోని ఆయా గ్రామాలకు చెందిన పలువురు లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ కింద రూ.22 లక్షల68 వేల500 రూపాయలు మంజూరయ్యాయని పార్టీ మండల అధ్యక్షులు దుర్గారెడ్డి అన్నారు సోమవారం నాడు పుల్కల్ మండల కేంద్రంలో లబ్ధిదారులకు సీఎం ఆర్ ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేదలు వివిధ రకాల జబ్బులతో మెరుగైన వైద్యం కోసం కార్పొరేట్ ఆసుపత్రుల్లో లక్షల రూపాయలు ఖర్చు చేసుకొని వైద్యం చేయించుకుంటున్నారు అట్టి నిరుపేదలను కొంత మేరకు ఆదుకునేందుకు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి అయిన దామోదర్ రాజనర్సింహ తమ సొంత మండలం అయిన పుల్కల్ మండలాన్ని ప్రతి విషయంలో తమ వంతు సహకారాలు అందజేయడంలో తమ మంత్రి ముందున్నారన్నారు. మండలంలో ఎవరికైనా ఎప్పుడైనా ఎలాంటి కష్టం వచ్చినా నేనున్నానంటూ తమ ఫోన్ ద్వారా లేక నేరుగా వచ్చి వారి కష్టసుఖాలను అడిగి తెలుసుకునే తత్వం కేవలం తమ మంత్రి దామోదర్ రాజ నరసింహకే ఉందన్నారు. తెలుసుకోవడమే కాకుండా అట్టి సమస్య వెంటనే పరిష్కారం అయ్యే దిశగా పనిచేస్తున్నారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని త్వరలోనే నెరవేర్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఇప్పటికే చాలా హామీలు నెరవేర్చారన్నారు కావున కాంగ్రెస్ ప్రభుత్వం అంటే మాటల ప్రభుత్వం కాదు చేతల ప్రభుత్వం అని వారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు దుర్గారెడ్డి. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు
రామ్ చంద్రారెడ్డి. లక్ష్మారెడ్డి. బోయిని శ్రీనివాస్. మాజీ సర్పంచ్ శ్రావణ్ కుమార్. మన్నే విట్టల్. సాజిద్. బెస్త ప్రశాంత్. భాస్కర్. మల్లారెడ్డి. మ్యాతరి శ్రీనివాస్ కాంగ్రెస్ పార్టీ నాయకులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు

# ప్రజా సమస్యల పరిష్కారంలో సోషల్ మీడియాదే కీలకపాత్ర

- సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం...








**ఖమ్మం ఆగస్టు 26 :** ప్రజలు సమస్యలు పరిష్కరించడంలో సోషల్ మీడియా కీలక పాత్ర పోషిస్తుందని సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. సోషల్ మీడియా రాష్ట్ర స్థాయి రెండు రోజులు రాజకీయ శిక్షణా తరగతులు సుందరయ్య భవన్ లో ప్రారంభం అయ్యాయి. సోషల్ మీడియా రాష్ట్ర నాయకులు పిట్టల రవి అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ప్రధాన మీడియా కార్పొరేట్ కనుసన్నల్లో మెలుగుతున్న దశలో సోషల్ మీడియా గ్రామీణ స్థాయిలో ప్రజా ఇబ్బందులను వెలుగు తీయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వాల లో దివాలా కోరు విధానాలను ఎండగట్టాలన్నారు. ఖమ్మంలోని సోమవారం సుందరయ్యభవన్‌లో ఏర్పాటు చేసిన సిపిఎం రాష్ట్ర సోషల్ మీడియా శిక్షణా తరగతులలో తమ్మినేని ప్రారంభ ఉపన్యాసం చేశారు. సోషల్ మీడియాతో యువత ప్రభావిత మవుతోందని, అందుకే ఆధునిక ఆలోచనలతో కూడిన పార్టీ కార్యక్రమాలను మీడియా ద్వారా తెలియజేయనున్నట్లు చెప్పారు. గత ఐదేళ్లుగా సామాజిక మార్పులో సోషల్ మీడియా కీలక భూమిక పోషించిందని అన్నారు. కొన్ని రాజకీయ పార్టీల కార్యకర్తలు సోషల్ మీడియాను వేదికగా చేసుకొని ముందుకు సాగుతున్నారని తెలిపారు. పార్టీ పనివిధానం, సిద్ధాంతాలను ప్రజలకు తెలియజేయడంలో సరైన కార్యాచరణ లేక తమ నాయకత్వం తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటుందని అన్నారు. దేశంలో బీజేపీ ప్రభుత్వం మూడోవ సారి అధికారంలోకి వచ్చిన తర్వాత సోషల్ మీడియాలో పిచ్చి అబద్దాలతో సోషల్ మీడియాలో విషం వెదజల్లే పనిలో బీజేపీ శ్రేణులు వున్నారు అని విమర్శించారు. ఫేక్ వీడియోలతో విద్వేషాలు నింపే పనిలో వున్నారు అని విమర్శించారు. ప్రజలకు వాస్తవాలు చెప్పే విధంగా సోషల్ మీడియాలో పార్టీ శ్రేణులు పని చేయాలని కోరారు. రాష్ట్ర పార్టీ కార్యదర్శివర్గ సభ్యులు అబ్బాస్, ఖమ్మం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, నాయకులు బండారు రవికుమార్, జగదీష్, వై విక్రమ్, సుందర్, శంకర్, నర్సిరెడ్డి, గొడుగు వెంకట్ యాటల సోమన్న తదితరులు పాల్గొన్నారు

## కృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొన్న మార్నేనీ





**వర్ధన్నపేట ఆగస్ట26 :** శ్రీ కృష్ణాష్టమి పర్వదినాన్ని పురస్కరించు కుని యాదవ సంఘం ఆధ్వర్యంలో వర్ధన్నపేట మున్సిపాలిటీ కేంద్రంలో ఏర్పాటు చేసిన వేడుకల్లో పాల్గొన్న తెలంగాణ రాష్ట్ర కో ఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ చైర్మన్ మార్నేనీ రవీందర్ రావు ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు నాయకులు కార్యకర్తలు భక్తులు పాల్గొన్నారు.

## పుల్లూరులో 10వ తరగతి సెంటర్ ఏర్పాటు చేయాలి

- పుల్లూరు గ్రామ ప్రజలు

**సిద్దిపేట ఆగస్టు 26 :** సిద్దిపేట జిల్లా సిద్దిపేట రూరల్ మండలం పుల్లూరు గ్రామంలో గతంలో ఇక్కడ ప్రభుత్వ జిల్లా పరిషత్ పాఠశాలలో చదువుకునే విద్యార్థులకు ఒకటవ తరగతి నుండి పదవ తరగతికి దానితోపాటు మెట్రికులేషన్ కూడా ఉండేది. తదనంతరం గ్రామంలో పదవ తరగతి వరకు మాత్రమే అందుబాటులో ఉంది. తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కూడా 8వ తరగతి పుల్లూరులో చదివినాని గతంలో పలు సందర్భాల్లో మాట్లాడారు. చుట్టుపక్కల గ్రామాలకు రామంచ , మల్యాల , గుర్రాల గొంది, జక్కాపూర్, చిన్న గుండవెల్లి, రాఘవపూర్, లింగారెడ్డిపల్లి ,బండ చర్లపల్లి గ్రామాలకు 10వ తరగతి పబ్లిక్ ఎగ్జామ్స్ కు పుల్లూరే సెంటర్ గా ఉండేది. గడచిన మూడు సంవత్సరాల నుండి ఇక్కడ పదవ తరగతి సెంటర్ ను విద్యార్థులు తక్కువగా ఉన్నారని ఇక్కడి నుండి రాఘవపూర్ గ్రామానికి తరలించడంతో గ్రామ ప్రజల నుండి తీవ్రమైన వ్యతిరేకత వస్తుంది. పుల్లూరు ప్రభుత్వ జిల్లా పరిషత్ హై స్కూల్లో చదువుకున్న వారిలో మండల స్థాయి అధికారులు గాను మరియు పోలీస్ డిపార్ట్మెంట్లో దాదాపు 35 మంది కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తున్నారు. అలాగే ప్రభుత్వ ఉపాధ్యాయులుగా మరియు ప్రజా ప్రతినిధులుగా , మీడియా వివిధ రంగాల్లో ఎంతోమందిని ఉన్నత స్థాయిలో ఈ పాఠశాల ఉంచింది. అయితే ప్రస్తుతం పదవ తరగతి సెంటర్ తీసివేయడంతో గ్రామంలోని అన్ని వర్గాల ప్రజల నుండి తీవ్రమైన వ్యతిరేకత వస్తుంది. తక్షణమే జిల్లా విద్యాధికారి స్పందించి రానున్న పదవ తరగతి పరీక్షలకు సెంటర్ గా పుల్లూరు గ్రామాన్ని పెట్టాలని గ్రామ ప్రజలు కోరుకుంటున్నారు. లేనిపక్షంలో దీనిపైన గ్రామ యువకులు మరియు గ్రామంలోని ప్రజాప్రతినిధులు పార్టీలకతీతంగా పెద్ద ఎత్తున నిరసన ధర్నా కార్యక్రమాలు కూడా చేస్తామని హెచ్చరిస్తున్నారు.

# పండుగలు ఆధ్యాత్మిక చిహ్నాలు..

- ఘనంగా శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు.. - పాల్గొన్న నీలం మధు ముదిరాజ్..










**పటాన్చెరు ఆగస్టు26:** హిందూ సోదరులు భక్తి శ్రద్ధలతో అంగరంగ వైభవంగా జరుపుకునే పండుగలు ఆధ్యాత్మికతకు చిహ్నాలని మెదక్ పార్లమెంటు కాంగ్రెస్ పార్టీ కంటెస్టెడ్ క్యాండిడేట్ నీలం మధు ముదిరాజ్ అన్నారు.సోమవారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో భాగంగా నిర్వాహకుల ఆహ్వానం మేరకు సంగారెడ్డి పట్టణంలోని గణేష్ నగర్, రామచంద్రపురం డివిజన్ పరిధిలోని అశోక్ నగర్, బీరంగూడలోని సాయి కృప కాలనీ, ఇస్నాపూర్ లోని గోకుల్ కృష్ణ యాదవ్ సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఆయనకు ఘన స్వాగతం పలికి సత్కరించారు,
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆ శ్రీకృషునుని కృప రాష్ట్ర ప్రజలందరిపై ఉండాలి అని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ పుష్ప నాగేష్ యాదవ్, కౌన్సిలర్ కొల్లూరు మల్లేష్, ఎంపీటీసీ గడ్డం శ్రీశైలం, మాజీ సర్పంచ్లు బాలమణి, బురిగారి వెంకట్ రెడ్డి,దామోదర్ రెడ్డి,పాండురంగ, బస్వారాజు, వేంకటేశ్వరావు, శ్రీనివాస్, హరి బాబూ, స్థానిక ప్రజాప్రతినిధులు, కాలనీవాసులు,భక్తులు, ప్రజలు,తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ శ్రీ చైతన్య విద్యాసంస్థల అవినీతిపై సీబీఐ,ఈడితో విచారణ జరిపించాలి..







- ఫీజుల ముసుకుల్లో శ్రీ చైతన్య దందా........

- అక్రమ అరెస్టులను ఖండించండి...


- పి డి ఎస్ యు ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి మస్తాన్..





**ఖమ్మం ఆగస్టు 26 :** సోమవారం నాడు పిడిఎస్యు ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఖమ్మం నగరంలోని అధిక ఫీజులు వసూలు చేస్తున్న శ్రీ చైతన్య విద్యాసంస్థలను రద్దు చేయాలని. శాంతియుతంగా ధర్నా చేస్తున్న పిడిఎస్యు నాయకులను అక్రమంగా అరెస్టు చేయడాన్ని త్రీవంగా ఖండిస్తున్నాము అరెస్టు చేసిన నాయకులను తక్షణమే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నా....ఈ సందర్భంగా. పిడిఎస్యు ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి జి మస్తాన్ మాట్లాడుతూ..ఆంధ్ర కార్పొరేట్ విద్యాసంస్థ శ్రీ చైతన్య పేరుతో తెలంగాణలో అక్రమంగా పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చి వేలకోట్ల రూపాయల అవినీతి చేస్తున్న తెలంగాణ శ్రీ చైతన్య విద్యాసంస్థలపై సీబీఐ,ఈడి తో విచారణ జరిపించాలని, అక్రమంగా జిల్లాల్లో అనుమతి లేకుండా నిర్వహిస్తున్న పాఠశాలలను రద్దు చేయాలని, యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేసి అరెస్టు చేయాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం పిడిఎస్ యు డిమాండ్ చేస్తుంది. తెలంగాణ శ్రీ చైతన్య విద్యాసంస్థల్లో ఫీజులు నియంత్రణ చట్టం అమలులో లేదు. విద్యాహక్కు చట్టం అమలు చేయడం లేదు. లక్షల రూపాయలను వసూలు చేస్తూ దానికి తగిన విధంగా విద్యార్థులకు విద్యను, హాస్టల్ సౌకర్యాన్ని ఇవ్వడం లేదు. ఇటీవలే అనేక జిల్లాల్లో హాస్టల్ లో ఉంటున్న విద్యార్థులకు సరైన సౌకర్యాలు లేవని, కనీసం విద్యార్థులకు పెడుతున్న భోజనం నాణ్యంగా లేదని, హాస్టల్స్ లో ఉంటున్న విద్యార్థులు జైల్లో ఉన్నట్టు ఉంటున్నామని వాపోతున్నారు. ఇది వీళ్ళ ధనధాహానికి పరాకాష్ట. రవాణా శాఖ నిబంధనలు పాటించకుండా, బస్సుల ఫిట్నెస్ లేకుండా బస్సులు నడపడం ద్వారా అనేక ప్రమాదాలు జరుగుతున్నాయి. అభం శుభం తెలియని అనేకమంది విద్యార్థులు దీని ద్వారా ప్రమాదాలకు గురవుతున్నారు. నిబంధనలకు తూట్లు పొడుస్తూ, పేద మధ్య తరగతి విద్యార్థులను, తల్లిదండ్రులను మోసం చేస్తున్న శ్రీ చైతన్య విద్యాసంస్థలను వెంటనే రద్దు చేయాలని, 2025- 26 విద్యా సంవత్సరానికి అడ్మిషన్ల ప్రక్రియ నిలిపివేస్తూ విద్యాశాఖ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాము. వీరి విచ్చలవిడి ఫీజులు దోపిడీ అవినీతిపై సిబిఐ ఈడి లాంటి దర్యాప్తు సంస్థలతో విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తున్నాము. దీని కొరకు రేపు రాష్ట్రవ్యాప్తంగా తెలంగాణ శ్రీ చైతన్య విద్యాసంస్థల ముందు ఆందోళన చేపడుతున్నాము. దీనిని జయప్రదం చేయాలని విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేస్తున్నాము. ప్రత్యక్షంగా సీబీఐ, ఈడి, ఏసీబీ కూడా ఫిర్యాదు చేస్తామని రెండు రోజుల్లో విద్యాశాఖ అధికారులు, రాష్ట్ర ప్రభుత్వం స్పందించకుంటే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరిస్తున్నాము.. ఈ కార్యక్రమంలో పిడిఎస్ఈ జిల్లా కమిటీ సభ్యులు సాగర్ రామకృష్ణ గోపి అజయ్ వినోద్ అనూష పాల్గొన్నారు.

# మత్తు వదలరా సీక్వెల్.. వచ్చేది ఎప్పుడంటే..





మత్తు వదలరా.. ఐదేళ్ల కిందట వచ్చిన ఆ సినిమా ఎలాంటి హిట్ అయిందో అందరికీ తెలిసిందే. ఎటువంటి అంచనాలు లేకుండా ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఆ క్రైమ్ కామెడీ మూవీ.. ఆడియన్స్ నుంచి అదిరిపోయే రెస్పాన్స్ అందుకుంది. ఊహించని ట్విస్ట్ లతో సినీ ప్రియులను కట్టిపడేసింది. ఆ సినిమాతో ప్రముఖ సంగీత దర్శకుడు ఎం ఎం కీరవాణి చిన్న కుమారుడు శ్రీసింహా హీరోగా పరిచయమయ్యారు. డెబ్యూ మూవీతో మంచి హిట్ అందుకున్నారు ఆయన. రితేష్ రానా దర్శకత్వం వహించిన ఆ సినిమాలో శ్రీసింహాతోపాటు సత్య కీలకపాత్ర పోషించారు. తెలుగులో థ్రిల్లర్ మూవీస్ కు ఓ కొత్త అర్థం తీసుకొచ్చిన మత్తు వదలరా మూవీ 2019 డిసెంబర్ లో విడుదలైంది. అయితే కొన్ని నెలల క్రితం ఆ సినిమాకు సీక్వెల్ ను అనౌన్స్ చేసిన విషయం తెలిసిందే. ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకున్న సీక్వెల్ కు సంబంధించి క్రేజీ అప్డేట్ ఇచ్చారు మేకర్స్. శ్రీ కృష్ణ జన్మాష్టమి పండుగ సందర్భాన్ని పురస్కరించుకుని రిలీజ్ డేట్ ను అనౌన్స్ చేశారు. సెప్టెంబర్ 13న థియేటర్లలో రిలీజ్ చేయనున్నట్లు సోమవారం ప్రకటించారు. దాంతోపాటు రెండు పోస్టర్లను కూడా రిలీజ్ చేశారు. వాటి ద్వారా సినిమాను ఎక్స్ప్లెయిన్ చేశారు. ఫస్ట్ పోస్టర్ లో శ్రీసింహా, సత్య డైనమిక్ గా కనిపిస్తున్నారు. ప్రత్యర్థులపై తుపాకీలతో విరుచుకుపడుతున్నట్లు చూపించారు. బ్యాక్ గ్రౌండ్ లో హై ఎమర్జెన్సీ టీమ్ అని రాశారు మేకర్స్. మరో పోస్టర్ లో సీక్వెల్ కోసం యాడ్ చేసిన క్రైమ్ ఎలిమెంట్స్ ప్రతిబింబించేలా డిజైన్ చేశారు. ప్రస్తుతం అవి నెట్టింట వైరల్ గా మారాయి.అయితే డైరెక్టర్ రితేష్ కు మత్తు వదలరానే డెబ్యూ మూవీ. కానీ సూపర్ స్క్రిప్ట్ వర్క్ తో ఆయన అప్పుడు అదరగొట్టేశారు. ఇప్పుడు సీక్వెల్ ను కూడా అదే స్థాయిలో తెరకెక్కిస్తున్నారని తెలుస్తోంది. ప్రత్యేక టాస్క్లతోపాటు మరిన్ని ట్విస్ట్ లను యాడ్ చేసి మెప్పించనున్నారని సమాచారం. ఈసారి మత్తు వదలరా టీమ్ లోకి క్యూట్ హీరోయిన్ ఫరియా అబ్దుల్లా కూడా చేరింది. సునీల్, వెన్నెల కిషోర్, అజయ్, రోహిణి, రాజా చెంబోలు, ఝాన్సీ, శ్రీనివాస్ రెడ్డి తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ప్రతి పాత్ర కూడా వేరే లెవెల్ లో డిజైన్ చేసినట్లు వినికిడి. అయితే సీక్వెల్ ను ప్రముఖ మైత్రీ మూవీ మేకర్స్ సమర్పణలో క్లాప్ ఎంటర్టైన్మెంట్ బ్యానర్ పై చిరంజీవి (చెర్రీ), హేమలత పెదమల్లు నిర్మిస్తున్నారు. కీరవాణి మరో కుమారుడు, యంగ్ సింగర్ కాల భైరవ సంగీతం అందిస్తున్నారు. సురేష్ సారంగం సినిమాటోగ్రాఫర్ గా, కార్తీక శ్రీనివాస్ ఆర్ ఎడిటర్ గా వ్యవహరిస్తున్నారు. మరి మత్తు వదలరా సీక్వెల్ బాక్సాఫీస్ వద్ద ఎలాంటి హిట్ అవుతుందో వేచి చూడాలి.

# నాని హీరోయిన్.. ఒక్కసారిగా హీటెక్కించిందిగా!



నేచురల్ స్టార్ నాని పైసా సినిమా హీరోయిన్ గుర్తుందా? అదేనండీ సిద్ధికా శర్మ. ఆ మూవీలో అందం, అభినయంతో అలరించిన ముద్దుగుమ్మ.. అనుకున్నంత స్థాయిలో అవకాశాలు అందుకోలేకపోయింది. ఇప్పుడు తెలుగు సినిమాలకు దూరంగా ఉంది. ఉత్తరాఖండ్ కు చెందిన అమ్మడు.. మూవీల్లోకి రాకముందు మోడల్ గా రాణించింది. మోడలింగ్ చేస్తున్న సమయంలో టాలీవుడ్ లో ఛాన్స్ దక్కించుకుంది. ఆల్ ది బెస్ట్ మూవీతో హీరోయిన్ గా ఎంట్రీ ఇచ్చింది.జేడీ చక్రవర్తి, శ్రీకాంత్ లీడ్ రోల్స్ నటించిన ఆ సినిమా.. బాక్సాఫీస్ వద్ద ఆడియన్స్ ను మెప్పించలేకపోయింది. ఆ తర్వాత గాలి కుర్రోళ్లు మూవీలో యాక్ట్ చేసింది. ఫస్ట్ సినిమాలో తన పేరును లక్కీ శర్మగా తెలిపిన బ్యూటీ.. రెండో మూవీ కోసం షెఫాలీ శర్మ అని పెట్టుకుంది. కానీ ఆ మూవీ ఎప్పుడు రిలీజ్ అయిందో కూడా ఎవరికీ తెలియదు. అక్కడికి రెండేళ్ల తర్వాత నాని పైసా సినిమాలో ఛాన్స్ దక్కించుకుంది. కృష్ణ వంశీ దర్శకత్వం వహించిన ఆ సినిమాలో మంచి రోల్ లో కనిపించింది.పైసా మూవీలో బాగా డబ్బున్న వ్యక్తి కుమార్తెగా కనిపించి తన యాక్టింగ్ తో మెప్పించింది. ఆ సమయంలో తన ఒరిజినల్ నేమ్ ను బయటపెట్టింది. సిద్ధిక బాగానే నటించినా.. సినిమా అనుకున్నట్లు హిట్ అవ్వలేదు. దీంతో ఒక్కసారిగా మాయమైంది అమ్మడు. సుమారు ఐదేళ్లపాటు ఎక్కడా కనిపించలేదు. ప్రేమ పరిచయం మూవీతో మళ్లీ రీఎంట్రీ ఇచ్చింది. కానీ ఆ సినిమా కూడా నిరాశపరిచింది. అలా ఒక్క హిట్ అందుకోకుండానే ఆమె టాలీవుడ్ కెరీర్ ముగించింది. అయితే తెలుగు సినిమాలకు దూరంగా ఉన్నా.. సోషల్ మీడియాలో మాత్రం యాక్టివ్ గా ఉంటోంది అమ్మడు. ఎప్పటికప్పుడు కొత్త కొత్త పిక్స్ పోస్ట్ చేస్తూ సందడి చేస్తుంటోంది. రకరకాల ఫోటో షూట్స్ పోస్ట్ చేస్తూ అలరిస్తుంటోంది. తన అందాలతో కుర్రకారు హృదయా లను దోచుకుంటూ ఉంటోంది. అలా తన ఫాలోవర్స్ ను పెంచుకుంటూ ఉంటోంది. గ్లామర్ డోస్ పెంచేసి ఫిదా చేస్తుంటోంది. తాజాగా సిద్ధికా శర్మ నయా పిక్స్ ను తన ఫ్యాన్స్ కోసం షేర్ చేసింది.వైట్ ప్యాంట్ అండ్ బ్లూ కలర్ జాకెట్ వేసుకున్న అమ్మడు ఓ రేంజ్ లో ఉంది. హీట్ పుట్టించే అందాలతో ఒక్కసారిగా సెగలు పుట్టించింది. హెయిర్ లీవ్ చేసుకుని తన లుక్ తో ఆకట్టుకుంటోంది. ప్రస్తుతం అమ్మడు ఫోటో నెట్టింట తెగ చక్కర్లు కొడుతోంది. పిక్ అదిరిపోయిందని నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు. లైకుల వర్షం కురిపిస్తూ కామెంట్ సెక్షన్ నింపేస్తున్నారు. సో బ్యూటిఫుల్ అంటూ కొనియాడుతున్నారు.

# దీపికా పదుకునే.. అందుకే నెంబర్ వన్ అనేది!



అత్యధిక బ్రాండ్ వేల్యూ ఉన్న హీరోయిన్ గా కూడా దీపికా పదుకునే ఉంది. దీపికా పదుకునే ఖాతాలో ఇప్పుడు 1000ం కోట్లకి పైగా కలెక్షన్స్ అందుకున్న సినిమాలు నాలుగు ఉన్నాయి. వాటిలో పఠాన్, జవాన్, కల్కి 2898ఏడీ ఇండియన్ సినిమాలు కాగా హాలీవుడ్ మూవీ ట్రిపుల్ ఎక్స్ రిటర్న్ ఆఫ్ జెండర్ కేజ్ ఏకంగా 2300 కోట్ల కలెక్షన్స్ ని అందుకుంది. పఠాన్ 1060 కోట్లు, జవాన్ 1143, కల్కి 1150 కోట్ల కలెక్షన్స్ ని అందుకొని అరుదైన రికార్డ్ క్రియేట్ చేశాయి. ఏ ఇండియన్ హీరోయిన్ ఖాతాలో కూడా ఇన్ని వెయ్యి కోట్ల సినిమాలు లేవు. వీటి తర్వాత అత్యధిక కలెక్షన్స్ అందుకున్న సినిమాలు చూసుకుంటే 422 కోట్లతో చెన్నై ఎక్స్ ప్రెస్, 318 కోట్లతో ఏ జవానీ ఏ దివానీ, 367 కోట్లతో బాజీరావ్ మస్తానీ సినిమాలు ఉన్నాయి. వీటితో పాటు దీపికా పదుకునే సినిమాలన్నింటి కలెక్షన్స్ చూసుకుంటే సుమారు 9808 కోట్ల రూపాయిలు ఉన్నాయి. మరో 182 కోట్ల కలెక్షన్స్ సాధిస్తే ఇండియాలోనే ఫస్ట్ టైం 10000 కోట్ల కలెక్షన్స్ తన సినిమాలతో సాధించిన హీరోయిన్ గా నిలబడిపోతుంది సింగం అగైన్ సినిమాలో దీపికా పదుకునే ఈ క్లబ్ లో చేరిపోతుందని ట్రేడ్ పండితులు భావిస్తున్నారు. నెక్స్ట్ కల్కి పార్ట్ 2లో దీపికా పదుకునే పాత్ర మరింత బలంగా ఉంటుంది.ఆ సినిమా కనీసం 2000 కోట్ల కలక్షన్స్ ని ప్రపంచ వ్యాప్తంగా అందుకునే ఛాన్స్ ఉందని అంచనా వేస్తున్నారు. ఈ లెక్కన చూసుకుంటే హీరోయిన్ గా ఫేడ్ అవుట్ అయ్యే సమయానికి తన సినిమాలతో కనీసం 15000 కోట్ల కలెక్షన్స్ అయితే అందుకునే ఛాన్స్ ఉందని భావిస్తున్నారు. మరి అది ఎంత వరకు సాధ్యం అవుతుందనేది చూడాలి.

బాలీవుడ్ స్టార్ హీరోయిన్ గా దీపికా పదుకునే తిరుగులేని ఇమేజ్ తో దూసుకుపోతోంది. ఇండియన్ హీరోయిన్స్ లలో అత్యధిక రెమ్యునరేషన్ తీసుకుంటున్న నటిగా ఆమె క్రేజ్ అంతకంతకూ పెరుగుతూనే ఉంది. దీపికా పదుకునే ప్రస్తుతం ఒక్కో సినిమాకి 18 నుంచి 20 కోట్ల రెమ్యునరేషన్ గా తీసుకుంటున్నట్లు టాక్ వస్తోంది. ఇప్పటి వరకు ఏ హీరోయిన్ కూడా ఇండియన్ మూవీ ఇండస్ట్రీలో ఈ స్థాయికి ఎదగలేదు. ఇదంతా కేవలం ఆమెకున్న మార్కెట్ వేల్యూ బట్టి ఇస్తున్నారని చెప్పొచ్చు.

ప్రేమలో సడన్ ట్విస్ట్ అలాగే దేశంలోనే



# 'సాహో' బ్యూటీ అరుదైన వంద రికార్డ్

ప్రభాస్ హీరోగా నటించిన సాహో సినిమాలో హీరోయిన్ గా నటించిన ముద్దుగుమ్మ శ్రద్ధా కపూర్. సాహో సినిమా తెలుగు లో పెద్దగా ఆడకున్నా కూడా హిందీలో భారీ వసూళ్లను దక్కించుకుంది. దాంతో సాహో సినిమా దాదాపుగా రూ.150 కోట్ల వసూళ్లు నమోదు చేసింది. ఈ మధ్య కాలంలో హీరోలు వరుసగా వందల కోట్ల వసూళ్లు రాబడుతున్నారు. కానీ హీరోయిన్స్ లో ఒక్కరు ఇద్దరు మాత్రమే వందల కోట్ల క్లబ్ లో ఉన్నారు. కానీ శ్రద్ధా కపూర్ మాత్రం ఏకంగా తాను నటించిన ఏడు సినిమాలతో వంద కోట్లు, అంతకు మించి వసూళ్లు సాధించి రికార్డ్ సృష్టించింది.

తాజాగా విడుదల అయిన స్త్రీ 2 సినిమా ఇండియాతో పాటు, విదేశాల్లో కూడా భారీ వసూళ్లను రాబడుతూ దూసుకు పోతుంది. ఇప్పటి వరకు దాదాపుగా రూ.400 కోట్ల వసూళ్లను ఈ సినిమా రాబట్టిందని బాలీవుడ్ మీడియా వర్గాల ద్వారా సమాచారం అందుతోంది. రాజ్ కుమార్ రావు హీరోగా నటించిన స్త్రీ 2 సినిమాకు బాక్సాఫీస్ వద్ద నమోదు అవుతున్న వసూళ్లు చూసి ఇండస్ట్రీ వర్గాల వారు కూడా ఆశ్చర్యం వ్యక్తం చేస్తూ ఉన్నారు. బాలీవుడ్ లో ఈ ఏడాది సాలిడ్ హిట్ లేదు అనుకుంటున్న సమయంలో అనూహ్యంగా ఈ విజయం నమోదు అయ్యింది.

సాహో, స్త్రీ 2 సినిమాలతో పాటు ఇంకా చిచ్చోరే సినిమా కూడా శ్రద్ధా కపూర్ కి వంద కోట్లకు పైగా వసూళ్లు ఇచ్చింది. సుశాంత్ సింగ్ రాజ్ పూత్ హీరోగా నటించిన ఆ సినిమా విమర్శకుల ప్రశంసలు అందుకుని దాదాపుగా రూ.150 కోట్ల వసూళ్లు సాధించింది. ఈ అమ్మడు నటించిన మరో చిత్రం తూ జూటీ మై మక్కర్ చిత్రం కూడా ప్రపంచ వ్యాప్తంగా దాదాపుగా రూ.145 కోట్ల వసూళ్లు నమోదు చేసినట్లుగా తెలుస్తోంది. ఈమె చేసిన లేడీ ఓరియంటెడ్ సినిమాలకు కూడా ఈ స్థాయిలోనే వసూళ్లు నమోదు అవ్వడం జరిగింది. ఏక్ విలన్, స్త్రీ, ఏబీసీడీ, భాగీ 3 సినిమాలు కూడా శ్రద్ధా కపూర్ ని వంద కోట్ల క్లబ్ లో నిలిపాయి. రికార్డ్ స్థాయిలో ఏకంగా ఏడు సినిమాలతో వంద కోట్లు, అంతకు మించి వసూళ్లు సాధించడం ద్వారా శ్రద్ధా కపూర్ ఖాతాలో అరుదైన రికార్డ్ నమోదు అయ్యింది. ప్రస్తుతం చేస్తున్న రెండు సినిమాలు కూడా కచ్చితంగా వంద కోట్లు, అంతకు మించి వసూళ్లు చేస్తాయని, ప్రస్తుతం బాలీవుడ్ లో అత్యధిక క్రేజ్ ఉన్న హీరోయిన్స్ జాబితాలో శ్రద్ధా కపూర్ ముందు వరుసలో ఉందని ఆమె అభిమానులు సోషల్ మీడియా ద్వారా కామెంట్స్ చేస్తున్నారు.